ప్రజావాణి సమస్యలపై అలసత్వం వహించొద్దు

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, జనవరి 6 : ప్రజావాణి సమస్యలపై అలసత్వం వహించొద్దని అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, గంగాధర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి సమస్యలు, ఫిర్యాదులపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారమార్గాలు చూపాలన్నారు. ప్రజావాణిలో 48 అర్జీలను స్వీకరించామని, అందులో రెవెన్యూ శాఖకు-35, జిల్లా పంచాయతీ శాఖకు-6, హౌసింగ్‌కు-3, మున్సిపాలిటీ, రోడ్లు, భవనాలు, ఎక్సైజ్, పరిశ్రమల శాఖలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్ నివాసాల వద్ద వసతులు కల్పించాలని వినతి

ఆత్మకూరు(ఎం), జనవరి 6 : మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ నివాసాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గంగాధర్‌కు సోమవారం లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతిపత్రం అందజేసిన వారిలో లింగయ్య, రమేశ్, రాజు, ఎల్లయ్య, నర్సింహ, ప్రమీల, జ్యోతి, పుష్పలత, శోభ, యాదమ్మ ఉన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : మున్సిపల్ చైర్మన్ రాజు

బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, జనవరి 6 : పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలో మార్కండేయ దేవాలయం నుంచి వలిగొండ రోడ్డు వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో అంతర్గత ప్రధాన రహదారులకు ఈ రోడ్డు లింక్ రోడ్డుగా ఉంటుందన్నారు. అనంతరం స్థానిక గాంధీ పార్కును సందర్శించారు. పార్కు సుందరీకరణకు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొడిగే అరుణ, నాయకులు సుర్వి నర్సింహ గౌడ్, ముత్యాల భూపాల్‌రెడ్డి, గోశిక రవి, వెన్‌రెడ్డి సంధ్య, ప్రభాకర్‌రావు, కేవీబీ కృష్ణారావు, యానాల ప్రభాకర్‌రెడ్డి, ఉజ్జిని మంజుల పాల్గొన్నారు.

నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తాం

● మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

నాలాపై నిర్మాణాన్ని కూల్చివేసిన మున్సిపల్ సిబ్బంది

భువనగిరి అర్బన్, జనవరి 6 : పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో, నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి అన్నారు. పట్టణంలోని ఖాజి మహిళా కాలనీ సమీపంలో నాలాపై చేపట్టిన స్లాబ్ నిర్మాణాన్ని సోమవారం మున్సిపల్ సిబ్బందితో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాలపై అక్రమంగా నిర్మాణాలు చేసినా, పట్టణంలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినా కూల్చివేయడంతోపాటు తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మున్సిపాలిటీ నుంచి అనుమతి పొందిన తర్వాతే నిర్మాణాలు చేయాలని, లేకుంటే వాటిని వెంటనే కూల్చివేస్తామని తెలిపారు. అయితే.. గతంలో పట్టణంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ తెలిపారు. వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేయించిన మున్సిపల్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

రామన్నపేట, జనవరి 6 : రైతు భరోసా పథకం కింద సంవత్సరానికి ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఆశలు చూపి ఇప్పుడు రూ.12వేలు ఇస్తామంటున్న కాంగ్రెస్ సర్కార్ రైతులను దగా చేస్తుందని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసాను రైతు గుండె కోతగా మార్చిందన్నారు. రైతులు పండించిన పది రకాల పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ఒడ్లకు మాత్రమే అంటూ మాట మార్చి మోసం చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన చిరుమర్తి

మాజీ మంత్రి హరీశ్‌రావుతో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నాయకులు

నకిరేకల్, జనవరి 6 : మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెలే తన్నీరు హరీశ్‌రావు, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సోమవారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కలిశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చిరుమర్తి వెంట బీఆర్ఎస్ నకిరేకల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చెస్‌లో ప్రపంచ రికార్డు సాధించిన బిందుశ్రీ

బిందుశ్రీకి బహుమతి అందిస్తున్న అరవింద్

మిర్యాలగూడ, జనవరి 6: పట్టణంలోని ఐఎంఏ భవనంలో సోమవారం 2 నిమిషాల టార్గెట్ 20 పజిల్స్‌లో చెక్‌మెట్ చెస్ పోటీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన చిన్నారి బిందుశ్రీ కేవలం 1.49 నిమిషాల్లోనే 50 పజిల్స్‌లో చెక్‌మెట్ పెట్టి నోబెల్ వరల్డ్ రికార్డు సాధించి నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీని ఇంటర్నేషనల్ చెస్ క్రీడాకారుడు, న్యాయ నిర్ణేత అరవింద్ సమక్షంలో వీడియో రికార్డు చేసి మెయిల్ ద్వారా నోబెల్ వరల్డ్ రికార్డుకు పంపించనున్నట్లు అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి మాశెట్టి దివ్యశ్రీ తెలిపారు. బిందుశ్రీకు మిర్యాలగూడ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ సతీష్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్, బహుమతిని అందించారు. ఆమెను పలువురు అభినందించారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

వలిగొండలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

భువనగిరి అర్బన్, జనవరి 6 : రైతుభరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు అన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని రైతుబజార్ సమీపంలో ప్రధాన రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతుభరోసా ఎకరాకు రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాటమార్చి రైతు భరోసా రూ.12వేలు ఇస్తామని మోసం చేస్తుందని విమర్శించారు. రైతు భరోసాతోపాటు కౌలు రైతులకు, రైతు కూలీలకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల పక్షాన పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్ రైతులను రాజు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా వేయకుండా అప్పులపాలు చేస్తుందన్నారు. 2 పంటలకు పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు అప్పులు చేశారని, ఇప్పటికైనా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బీరు మల్లయ్య, సూరెపల్లి రమేశ్, తాడెం రాజశేఖర్, నాగారం సూరజ్, పోల ప్రవీణ్‌కుమార్, సిద్దుల పద్మ, రత్నపురం పద్మ పాల్గొన్నారు.

పోచంపల్లిలో ధర్నా

భూదాన్ పోచంపల్లి : రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టణంలో బీఆర్ఎస్ పాతర్ట ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వరంగల్ డిక్లరేషన్‌లో గొప్పలు చెప్పిన రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలన్నారు. రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులు, కూలీలకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, దేవరాయ కుమార్, నాయకులు మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, మల్లేశ్‌గౌడ్, మల్లారెడ్డి, బాలనర్సింహ, శ్రవణ్, కిరణ్, పెంటయ్య పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

మాట తప్పిన కాంగ్రెస్‌కు వాతలు పెట్టాలె

వలిగొండ : ఎన్నికలప్పుడు అన్నదాతకు ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వాతలు పెట్టాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. రైతు భరోసాపై మాట మార్చినందుకు సోమవారం మండల కేంద్రంలో భువనగిరి - చిట్యాల ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కింద సంవత్సరానికి ఎకరానికి రూ.15వేల పెట్టుబడి సాయం అందజేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు రూ.12వేలు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అన్నదాతల ఓట్లు దండుకొని మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వాతలు పెట్టాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వంగాల వెంకన్న, మొగుళ్ల శ్రీనివాస్, పనుమటి మమతానరేందర్‌రెడ్డి, డేగల పాండు, కొమిరెల్లి సంజీవరెడ్డి, మద్దెల మంజుల, జానీ అఫ్రోజ్, కొండూరి వెంకటేశం, అయిటిపాముల ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆరుట్ల పోరాటం స్ఫూర్తిదాయకం

● కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి దంపతుల చిత్రపటానికి నివాళిలర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఆలేరు టౌన్, జనవరి 6 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి పోరాటం స్ఫూర్తిదాయకమని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆరుట్ల దంపతుల జ్ఞాపకార్థం ఆరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సాయుధ రైతాంగ ఉద్యమాన్ని నడిపిన యోధులు ఆరుట్ల దంపతులు అని కొనియాడారు. సావిత్రిబాయి, జ్యోతిరావు పూలే ఆశయ సాధనలో ఆరుట్ల దంపతులు నడిచారని తెలిపారు. సాయుధ రైతాంగ పోరాటంలో నల్లగొండ జిల్లా నుంచి ఆరుట్ల దంపతులతోపాటు ఆదినారాయణ రెడ్డి, సుద్దాల హన్మంత్, డీఎల్ రెడ్డి ఎంతో మంది పోరాటయోధులు పాలుపంచుకున్నారన్నారు. ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి జ్ఞాపకార్థం క్రీడా పోటీలు నిర్వహించడం వారి పోరాట పటిమకు నిదర్శనమని పేర్కొన్నారు. అంతకుముందు కట్కూరి రామచంద్రారెడ్డి, సుశీల దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆరుట్ల ఫౌండేషన్ చైర్మన్ సుశీల, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, వైస్ చైర్‌పర్సన్ మొరిగాడి మాధవి, ఎంఈఓ లక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల, ఫిజికల్ డైరెక్టర్ పూల నాగయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, జోసెఫ్ పాల్గొన్నారు.

'శ్మశానవాటిక ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

తుక్కాపురంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 6 : వందసంవత్సరాలుగా ఉన్న శ్మశాన వాటికలోని సమాధులను జేసీబీలతో ధ్వంసం చేసిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆ భూమిని పరిరక్షించాలని తుక్కాపురం గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని తుక్కాపురం గ్రామంలో సర్వే నెంబర్ 113లోని 1.20గుంటల భూమిలో 100సంవత్సరాలుగా గ్రామానికి చెందిన వివిధ కులాలకు చెందిన 120 సమాధులు, 200లకుపైగా బొందలు ఉన్నాయన్నారు. వాటిని గ్రామానికి చెందిన కంఠం దయాకర్, అతని కుమారుడు దినేశ్ జేసీబీలతో కూల్చివేసి నేలమట్టం చేశారన్నారు. వారిపై చర్యలు తీసుకొని శ్మశానవాటికను పునరుద్ధరించి సరిహద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. దుండగులపై కలెక్టర్, తాసీల్దార్, ఎంపీడీఓ, రూరల్ సీఐతో పాటు వివిధ శాఖల అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన అఖిలపక్ష నాయకులు జనగాం పాండు, పుట్ట వీరేశ్, నోముల మహేందర్‌రెడ్డి, నల్లమాస సత్యనారాయణ, రాసాల మల్లేశ్, ఏడుమేకల మహేశ్, జనగాం మహేశ్, సతీశ్, శ్రీనివాస్, వెంకటాచారి, సత్తయ్య, రవి, ప్రవీణ్‌రెడ్డి, నగేశ్, వెంకటేశ్, ఉప్పలమ్మ, నర్సింహాచారి, వెంకయ్య, చంద్రపాల్, స్వామి, భిక్షపతి, కుమార్, అశోక్, వేణు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ట్రాఫిక్ ఎస్ఐ

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ యాదయ్య

చౌటుప్పల్, జనవరి 6 : ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ యాదయ్య అన్నారు. పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మైనర్లు బైక్ నడుపవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేయరాదని సూచించారు. కారు డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్ట్ వాడాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ వై.రాంరెడ్డి, పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

'సమాధులు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి'

భువనగిరి అర్బన్, జనవరి 6 : పట్టణంలోని తాతానగర్ కాలనీ సమీపంలో గల శ్మశానవాటికలో ఆదివారం రాత్రి ముదిరాజ్ కుల స్తుల సమాధులను కూల్చివేసిన గుర్తు తెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం ఏసీపీ రవికిరణ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇందులో భాగంగా 50 నుంచి 60 సమాధులను జేసీబీ సహాయంతో కూల్చివేశారని తెలిపారు. ఈ విషయంపై పూర్తి విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతి పత్రం ఇచ్చిన వారిలో పెంట నర్సింహ, గుర్రాల మల్లేశ్, నర్ల నర్సింగ్‌రావు, గుర్రాల దశరథ, భిక్షపతి, కృష్ణ, నాగేందర్, నాగరాజు, లక్ష్మయ్య

ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు

మోత్కూరు, జనవరి 6 : మున్సిపాలిటీలో ఫిబ్రవరి మొదటి వారంలో రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించాలని సోమవారం జరిగిన అఖిల పక్ష సమావేశం నిర్ణయించింది. అభ్యుదయ కళా నిలయం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం సమావేశం నిర్వహించారు. నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో అభినయ కళా సమితి అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్, ఎంఈఓ గోపాల్‌రెడ్డి, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ కల్పించాలి

● వికలాంగుల హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు నాగరాజు

బీబీనగర్, జనవరి 6 : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కనకబోయిన నాగరాజు ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. బడుగు, బలహీన వర్గాలకు ఇస్తున్న రిజర్వేషన్ ప్రకారం దివ్యాంగులకు కూడా ఐదు శాతం కోటా ఇస్తే రాష్ట్రంలో 1200 మందికి పైగా దివ్యాంగులకు రాజకీయ సాధికారత కల్పించిన వారవుతారని పేర్కొన్నారు. ఈ మేరకు చట్ట సవరణ చేసి స్థానిక సంస్థల్లో అన్ని హోదాల్లో ఐదు శాతం ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

చౌటుప్పల్, జనవరి 6 : మండలంలోని లక్కారం ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 6నుంచి ఫిబ్రవరి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హజారయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకొని సమీప మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య

సంతోష్‌నాయక్ (ఫైల్)

తుర్కపల్లి, జనవరి 6 : తండ్రి మందలించాడని మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పెద్దతండాలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ తకియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతండాకు చెందిన ధనావత్ సంతోష్‌నాయక్ (26) డిగ్రీ పూర్తి చేసి కొంతకాలంగా ఖాళీగా ఉంటున్నాడు. అది నచ్చని తండ్రి సక్రూ ఏదో ఒక పని చూసుకోమని తరుచూ చెప్పేవాడు. ఈ క్రమంలో ఆదివారం కొడుకుతో పని విషయమై మందలించాడు. దాంతో మనస్తాపానికి గురైన సంతోష్‌నాయక్ తన ఇంటి సమీపంలో ఖాళీగా ఉన్న చిన్నమ్మ ఇంట్లోకి వెళ్లి డోరు వేసుకొని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సక్రూ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు.

మాజీ ఎమ్మెల్యే సునీత నివాళి

సంతోష్‌నాయక్ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సోమవారం నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు.

'రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి'

ఆత్మకూరు(ఎం), జనవరి 6 : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 9న జరుగనున్న రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సు సందర్భంగా రజక వృత్తి ఆధునీకరణ - ఉపాధి కల్పనకు వృత్తి రక్షణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి రజకులు హాజరు కావాలని కోరారు. సంఘం నాయకులు రాములు, యాదయ్య, నగేశ్, మురళీ కృష్ణ, సత్యనారాయణ, నరేశ్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి తలసానిని కలిసిన యాదవ సంఘం నాయకులు

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

యాదగిరిగుట్ట, జనవరి 6 : మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం, స్వామివారి ప్రసాదాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెబోయిన అయోధ్యయాదవ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ముక్యర్ల సతీశ్‌యాదవ్, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ యాదవ్, నాయకులు నక్కల చిరంజీవి, సురేశ్, శ్రీరామ్ యాదవ్ పాల్గొన్నారు.

దాసరి సోమయ్య మృతి తీరని లోటు : కంచర్ల

సోమయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు, జనవరి 6 : మోత్కూరు మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు దాసరి సోమయ్య మృతి తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన సోమయ్య మృతదేహానికి సోమవారం ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పేదల కుటుంబానికి చెందిన సోమయ్య తాపీ మేస్త్రీగా పనిచేసి కార్మికులకు అండగా ఉండి పనిచేశారని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో కీలకంగా పని చేశారని తెలిపారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, జంగ శ్రీను, నాయకులు పురుగుల రమేశ్ ఉన్నారు.

నేటి రైతు ధర్నాకు తరలిరావాలి : కర్రె వెంకటయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటయ్య

యాదగిరిగుట్ట, జనవరి 6 : రైతన్నకు మద్దతుగా యాదగిరిగుట్టలో మంగళవారం నిర్వహించే నిరసన ర్యాలీ, ధర్నాకు రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కింద ఏడాదికి ఎకరానికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు సవాలక్ష షరతులు పెట్టి రూ.12వేలు ఇస్తామని మోసానికి తెరలేపారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు పట్ల రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఉద్యానవన రైతులు, ఉద్యోగులకు రైతు భరోసా అమలుపై స్పష్టత లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టెక్కేందు